# సాక్ష్యం లేక

**శిక్ష పడ్డవాళ్ళందరూ దోషులూ కారు, దోషులందరికీ శిక్ష పడుతుందనీ లేదు. సాక్ష్యం లేక కోర్టులో శిక్ష తప్పించుకొన్నా మనస్సాక్షిని మభ్యపెట్టలేం**

శివయ్య ఎప్పుడు సిద్దయ్య అయ్యాడో, ఎలాగ అయ్యాడో కూడా నాకిప్పుడు జ్ఞాపకం లేదు. తాతగారి ఊరు వెళ్ళి ఎన్నేళ్ళు అయిపోయిందో... ఎప్పుడూ లెక్క పెట్టుకోలేదు కూడా. ప్రతిసారీ ఇండియా రావడం, తెగ తిరగడం, తెగ కొనడం, స్నేహితులూ, చుట్టాలూ, పెళ్ళి సంబంధాలూ హడావిడిగా కానిచ్చెయ్యడం, వచ్చినంత ఉరుకలు పరుగులుగా తిరుగు ప్రయాణం. ఇదో రొటీన్ అయిపోయింది. ఎన్నోసార్లు అనుకునేవాణ్ణి తాతగారి ఊరొకసారి చూసి రావాలని.

అబ్బో, ముప్ఫయ్ ఏళ్ళ పై మాట. నేను అమెరికా వెళ్ళిపోతున్నానని మా ఊళ్ళో శివాలయంలో పూజ చేసి మరీ వెళ్ళాలనీ, వీలుంటే అలాగే సింహాచలం కూడా వెళ్ళి మరీ వెళ్ళాలనీ అంతా పట్టు పట్టారు. లేకపోతే అప్పుడూ వెళ్ళేవాడిని కాదేమో!

అప్పటికే, అంటే నా పాతికేళ్ళ వయసప్పుడే తాత బాగా పండిపోయారు.

పెద్ద లోగిలి ఉన్నా తిరగడానికి జనం లేరు. వచ్చిపోయే కొడుకులూ, కూతుళ్ళూ. వారి సంతానానికి అసలు పల్లె జీవితం పడదు. రమ్మన్నప్పుడల్లా ఒకటే సమాధానం- బోర్.

అలా ఆ ఊరికి చావుకీ, శుభానికీ తప్ప వెళ్ళడం తగ్గిపోయింది.

తాతయ్య తోపులో పాత పెంకుటిల్లు ఉంది. దాంట్లో ఉండేవాడు శివయ్య. పాలేరా! ఈ కాలపు సెక్రటరీనా- అర్థం అయ్యేది కాదు అతని స్థానం నాకు.

తాతకు కుడి భుజం, ఎడం భుజం, బుర్రా, ఆలోచనా అంతా అతనే.

నాకు బాగా జ్ఞాపకం- మామయ్యలు అతని అథారిటీ చూసి ఉడుక్కునేవాళ్ళు. 'మా కంటే వానికే ఎక్కువ హక్కున్నట్టుందే ఇక్కడ' అని గొణుక్కునేవాళ్ళు.

నాకు బాగా జ్ఞాపకం- అప్పటికే శివయ్య తలా మీసకట్టూ ఉప్పూ మిరియాలూ కలబోసినట్లు ఉండేది. తనకి అంటూ ఎవరూ ఉండేవారు కారు. తోపులో కొంపలో హాయిగా ఉండేవాడు. తోపునానుకునే పొలాలు. అంచేత ఉండివుండి ఓ గాలితుపాకీ పేలుస్తుండేవాడు... బిలబిలమంటూ పక్షులు గుంపులుగా పైకెగిరేవి.

మళ్ళీ అవి ధైర్యం చేసి తిరిగి వాలడానికో ఇరవై ముప్ఫయ్ నిమిషాల కంటే పట్టేది కాదు. మళ్ళీ ఎటో తిరుగుతూ పేల్చేవాడు.

ఇదే ధోరణి.

పిచ్చి పక్షులు ప్రమాదం తప్పిందని వాలడమే తరువాయి. ఎగరడమే తరువాయి.

'బాబూ అమెరికా ఎక్కడుంది? వారం పది రోజులకోసారి వచ్చి పోతూండు' అనేవాడు. 'పక్క టౌన్‌లలో, సిటీల్లో ఉన్నవాళ్ళే రావడం లేదు. వేల మైళ్ళ దూరం నుంచి నేనెలా రాగలుగుతాను శివయ్యా' అని గట్టిగా నవ్వేవాడిని.

శివయ్యకి దూరాలు ఎప్పుడూ అర్థం కావు. అతను నూతిలో కప్ప కాదు కానీ, కొన్ని చెరువులో కప్ప అంతే. పొలం, తోట, పంట, పక్షులు, ఇంత తిండి- అంతేగా ఉండేది వాని లోకం.

ప్రతిసారి ఇండియా వచ్చినప్పుడూ 'ఓ సారి పల్లె వెడదాం' అంటే నా పెళ్ళాంపిల్లలకి కుదిరేది కాదు. 'అక్కడేముంది? మన పిల్లలు ఒక్క గంట కూడా ఉండలేరు. అయినా, ఇంత షాపింగూ అవీ ఉండి అక్కడికెళ్ళి ఏం చేస్తారు' అని నా ఆలోచనలకి అడ్డుకట్ట రపీమని వడేసేవాళ్ళు.

ఇప్పుడక్కడ అమెరికాలోనూ జన్మభూమి ఫ్యాషన్ అయింది.

ముఖ్యంగా పంజాబీ మిత్రులు, గుజరాతీ మిత్రుల మాటలు విన్నప్పుడు నాకూ అనిపించేది - 'చ, నేనేం చేస్తున్నాను' అని. 'మేం పరిశ్రమలకి పెట్టుబడి పెట్టాలంటే మా రాష్ట్రంలోనే పెడ్తాం. ఏదైనా విరాళంగా ఇచ్చి బాగు చేయాలనిపిస్తే నా పల్లెకే ఇస్తాను' అంటూ బీరు తాగుతూ చాలా గర్వంగా చెప్పే పటేల్, గులాబ్ సింగులని చూసినప్పుడూ, విన్నప్పుడూ చాలా నేరం చేసినట్టు అనిపించేది.

'ఎంతసేపూ సిటీలో ఇది కొందాం, అది కొందాం అనేగాని' అనేలోగా నా శ్రీమతి 'ఏం, డాలర్లు పట్టుకెళ్ళి ఆ కుళ్ళులో గుమ్మరిస్తారా' అనేది. ఇక వాదన అనవసరం అని ఊరుకోవడం అలవాటు చేసుకున్నాను. 'సంసారం సాఫీగా సాగిపోవాలంటే శ్రీమతి వెంట నడవడం ఒక పద్ధతి' అని నిర్ణయించేసుకున్నాను.


కానీ, నా మనసులో తాతగారి ఊరు మెదలుతూనే ఉంది. చూడాలనే ఉంది. నాకా అవకాశం చాలా ఆలస్యంగా వచ్చింది. 'అస్తమానం ఇండియా ఎందుకు? అక్కడ ఏముందని. ఇటు- ఇండొనీసియా అవీ చూద్దాం' అని హాలిడే ప్లాన్ వేస్తున్నవాళ్ళతో, 'మీరు వెళ్ళండి. నేను ఇండియా ఒక్కడినీ వెళ్ళి రావాలని ఉంది' అన్నా. 'అబ్బ, ఇప్పటికి కోరిక తీర్చుకుందామని నిర్ణయించుకున్నారన్న మాట' అంటూ నా శ్రీమతి వెక్కిరించింది. కానీ, నా నిర్ణయం మార్చుకోలేదు.

"ఓ మీ మినిస్టరుగారు జన్మభూమి అంటూ ఊదరకొట్టేస్తున్నారుగా. మీ తాతగారి ఊరు బాగుచేస్తే దానికి ఆర్థిక సహాయం చేస్తానని బేరం పెట్టండి. డబ్బు పోయినా పేరైనా వస్తుంది" అంది. దానికీ ఊరుకున్నాను. వీళ్ళకి ఎందుకు అర్థం కాదు- పుట్టిన ఊరు, పెరిగిన ఊరు చూడాలనిపించడం చాలా సహజమని.

అలా అన్నీ కలిసివచ్చి నేను ఈసారి నా దేశ యాత్ర జన్మస్థలం దర్శించడంతో ప్రారంభించే అవకాశం దొరికింది. నా సంతోషానికి హద్దులేదు. నా ఉత్సాహం ఉరకలు వేసింది.

* * *

చిత్రాలు: నర్సిం



మా ఊరి దారి మారింది. రోడ్డు పడింది ఊరి బయట. కానీ, ఇంకా ఊళ్ళోకి కాలి బాటే.

భుజాన బ్యాగ్ వేసుకుని తాతగారి ఇంటికి నడక ప్రారంభించాను. ఏవో పిచ్చిపిచ్చి ఊహలు రెక్కలు విప్పి నా తల చుట్టూ కాంతిచక్రంలాగా తిరుగుతున్నట్టు అనిపించింది. శివయ్య ఎలా ఉన్నాడో. అసలు ఉండీ ఉంటాడా? తాత కాలగర్భంలో కలిసిపోయాడని తెలుసు.

పొలాలు కౌలుకిచ్చేశారు. అదీ తెలుసు. కానీ, శివయ్యనెవరు తీసుకుంటారు. నవ్వు వచ్చింది నాకు.

"మీ పెదమామ చిన్న కాటేజీ కట్టించారండీ తోపులో. అప్పుడప్పుడు

వచ్చిపోతుంటారు. అంచేత మీరు ఉండడానికేం ఇబ్బంది ఉండదు" అన్నాడొకాయన దారిలో కలిసి.

"మరి శివయ్యో?" నా ప్రశ్న నా నోట్లోంచి పూర్తిగా బయటికి రాకుండానే ఆ పెద్ద మనిషి గట్టిగా నవ్వేసి, "వాడెక్కడికి పోతాడు. ఈ ఊళ్ళో వాడో రాయి, మట్టిలాగా శాశ్వతం" అంటూ సాగిపోయాడాయన హడావిడిగా - బహుశా బస్సు పట్టుకోవాలేమో.

ఇంకా శివయ్య ఉన్నందుకు నేను చాలా సంతోషపడ్డా. అతనూ లేకుంటే నేనా పల్లెలో టోటల్ స్ట్రేంజర్‌ని.

నేను తోపు దారిలోకి మళ్ళా.

దూరం నుంచే కూలిపోవడానికి ముహూర్తం పెట్టుకున్నట్టుగా శివయ్య పెంకుటిల్లు కనిపించింది. అది ఓ పక్క వాలినట్టుంది.

లోపలి దూలం జారిందో ఏమో.

ఇంటిపై పెంకులు నల్లగా మసిబారిపోయి, కాలితే ఆర్పిన కొంపమీది పెంకుల్లాగా కనిపించాయి.

అయినా, నాకెంతో ఉత్సాహం కలిగింది - అతనున్నందుకు, నేనా పెంకుటిల్లు కనిపెట్టగలిగినందుకు.

నాకా శివయ్య చిన్నప్పుడు పెద్ద హీరోలాగా అనిపించేవాడు.

అతని ముఖంలో నవ్వు ఎప్పుడూ చూడలేదు. మాటాడినా ఒకటో అరో, శుద్ధ విలన్‌లా. కళ్ళు చేష్టలు ఎంతో చెప్పేవి. తోపు, పొలం అతని శరీరానికి విస్తరించిన భాగాలుగా భావించేవాడో ఏమో. ఎలకల్ని, పందికొక్కుల్ని, కుందేళ్ళని, అప్పుడప్పుడు చొచ్చుకువచ్చే పందుల్ని నిర్దాక్షిణ్యంగా చంపేసేవాడు.

కొన్ని దూరంలో చితుకుల మంటలో పడేసి కాల్చేసేవాడు.

అవి కాలుతున్నప్పుడు ఆ చితుకుల మంట వెలుగులు వాడి ముఖం మీద వెలుగునీడలు చిమ్ముతున్నప్పుడు కాస్త భయం వేసేది. 'శత్రు శేషం బాబూ' అనేవాడు నవ్వి.

అబ్బ, ఎంత క్రూరంగా కనిపించేదో ఆ ముఖం. అలాంటివాడు ఏ మేకకేనా జబ్బుచేసినా, ఏ కాలో విరిగినా భుజాన పడేసుకుని మైళ్ళు నడిచి పక్క ఊరి పశువుల ఆస్పత్రికి తీసుకెళ్ళి మందు వేయించేవాడు.

మనిషిలో రాక్షసుడూ, మానవుడూ కలిసి పోయారా ఈ శివయ్యలో అనుకునేవాణ్ణి. ఇల్లు సమీపించడంతో జ్ఞాపకాలకి స్వస్తి చెప్పి గుమ్మం ముందు నిలబడి "శివయ్యా" అని పిలిచా. బదులుగా ఓ పదహారేళ్ళ పడుచు బయటికి వచ్చింది, 'ఎవరూ' అంటూ. "సిద్ధయ్య తాతకి ఒంట్లో నలతగా ఉంది" అంది.

"ఏం, ఏమైంది. నేను దేశం నుంచి వచ్చానని చెప్పు" అన్నా ఏం చెప్పాలో, ఆమె ఎవరో తెలియక. నాకు తెలిసినంతవరకు శివయ్య సిద్ధయ్యగా ఎప్పుడు మారాడో అర్థం కాలేదు. అతనసలు పెళ్ళి చేసుకున్నాడా లేదా. ఈ పిల్ల కూతురా, మనవరాలా ఏం తెలియదు.

పిల్ల లోపలికెళ్ళి మళ్ళీ వచ్చి, "రండి, పిలుస్తున్నాడు" అంటూ తలుపు బార్లా తెరిచి, "తల జాగ్రత్త" అని హెచ్చరించింది.

నన్ను చూసి శివయ్య కళ్ళు మెరిశాయి. మరుక్షణం మబ్బులు కమ్ముకున్నాయి.

"ఏమైంది శివయ్యా? నువ్వు తిరుగుతూ ఉంటావు. ఊరంతా తిప్పి చూపిస్తావు. పంచాయతీ ప్రెసిడెంటుగారికి పరిచయం చేస్తావు. తాత పేరిట ఈ ఊరి చెరువు పూడిక తీయించి బాగు చేయించాలని ఆశతో వచ్చానే" అన్నా అతని మంచం పక్కగా కర్ర కుర్చీ లాక్కుంటూ.

"దాందేముంది బాబూ. అందర్నీ చూసొచ్చారా?" ఆత్రంగా అడిగాడు.

"నేను నిన్ను చూడాలని, ఈ ఊరు చూడాలనే ఈసారి ఇండియా వచ్చాను శివయ్యా" అన్నా.

అతను గట్టిగా ఊపిరి తీసుకుని మంచం మీద లేచి కూర్చున్నాడు. అతని ముఖంలో ఏదో తెలియని ఆందోళన కదలాడుతూ ఉంది.

**అలా అన్నీ కలిసివచ్చి నేను ఈసారి నా దేశ యాత్ర జన్మస్థలం దర్శించడంతో ప్రారంభించే అవకాశం దొరికింది. నా సంతోషానికి హద్దులేదు. నా ఉత్సాహం ఉరకలు వేసింది.**

"పెళ్ళి చేసుకోలేదా?" నవ్వుతూ అడిగా.

లేదన్నట్టు అడ్డంగా తలూపి, "ఆ పిల్లది దిక్కులేంది. సాయంగా ఉంది... అంతా బాగున్నారా?" అడిగాడు.

అతనికి ఏదో అడగాలని ఉంది. కానీ, అడగలేకపోతున్నాడనిపించింది.

"నీకిలా జబ్బుగా ఉంటే పెద మామయ్య ఎందుకు రాలేదు? ఆస్పత్రిలో చేర్పించి ఉండొచ్చుగా." కాస్త కోపంగా అన్నా. అతనేం మాట్లాడలేదు. "ఇంటికి వెళ్ళండి బాబూ. నేను అన్నం పట్టుకొస్తా"నంటూ తలగడ కింద నుంచి తాళం గుత్తి తీసి ఇచ్చాడు. అప్పుడే నా కంట పడింది చిన్న తుపాకి. అది చూసి నవ్వి, "అదెందుకు శివయ్యా. ఇక్కడకీ నక్సలైట్ల బెడద పాకిందా?" అతను ఉలిక్కిపడ్డాడు. పిస్టల్‌ని ఇంకా తోసి దాచాడు.

నేను నవ్వుకుంటూ తాళం అందుకుని, పెదమామయ్య కాటేజీకేసి నడిచా. ఎప్పటిలాగా ఇక్కడి ప్రకృతి ఇంకా సహజంగానే ఉంది. అలికిడి విని అటూ ఇటూ పందికొక్కులు పరుగులు తీస్తున్నాయి. కుందేళ్ళు బాగా తగ్గిపోయాయి. 'దొరికిన కాడికి తినేస్తున్నారు కాబోలు' అనుకున్నా.

మామయ్య కాటేజీ మాంచి హోటల్ రూమ్‌లాగా ఉంది. సర్వసౌకర్యాలతోనూ, పడక గది, అల్మారాలో డ్రింకు సీసాలు వరుస కట్టి ఆధునికతని ఇనుమడింపచేస్తున్నాయి.

భోజనం పట్టుకుని శివయ్య వచ్చాడు. నేను తింటూంటే కూర్చుని సీరియస్‌గా ఆలోచిస్తున్నాడు.

"ఏదో చెప్పాలని ఉంది. చెప్పకూడదా? కనీసం నీకో ముసల్ది తోడుంటే అదేనా చెప్పేది." నవ్వుతూ అన్నాను. అతనేం మాట్లాడలేదు.

"మీ పెదమామయ్యని చూశావా బాబూ. ఈ మధ్య, అంటే రెండేళ్ళ క్రితందాక వస్తూ పోతూనే ఉండేవాడు. ఇప్పుడిక్కడికి అతని స్నేహితులు పిక్నిక్‌కి అంటూ వస్తున్నారు" అన్నాడు నా ముఖంలోకి చూస్తూ.

ఏదో చెప్పుకున్నాడు శివయ్య.

"అదయిపోయి చాలా ఏళ్ళయిందయ్యా." గంభీరంగా అన్నాడు శివయ్య. "మీ మామయ్యగా రిచ్చినదే ఆ పిస్టల్." అడక్కుండానే చెప్పాడు శివయ్య.

"ఏమైందో." అడిగా.

"ఏం లేదు. గవరమ్మ అని ఓ ఆడదాన్ని చంపాడని... సాక్ష్యం లేక జైలుకెళ్ళలేదు. వదిలేశారు." చాలా నెమ్మదిగా అన్నాడు.

"ఏమో, అతగాడు చంపలేదేమో." గొణుక్కున్నాడు శివయ్య.

ఏదో లేకపోతే కేసు అక్కడిదాకా ఎలా వెడుతుంది శివయ్యా. కాస్త స్త్రీ లోలుడని విన్నా పెదమామయ్య."

"అయితే అయివుండొచ్చులే బాబూ. అంతకి ముందే పిస్టలిచ్చి నేర్పించాడు కూడా. గాలి పిస్టల్ పేల్చడం తప్ప ఇది తెలియదు కదా."

"ఇప్పటికీ పక్షులు పంట పాడుచేస్తున్నాయా?"

"అదీ వాటి ధర్మం బాబూ. పంట కాచుకోడం మన ధర్మం" అంటూ కేరేజీ సర్దడం ప్రారంభించాడు శివయ్య. అతని చేతులు వణకడం చూశాను. తలెత్తి మాట్లాడకపోవడం గమనించా. కానీ, ఏమీ అడగలేకపోయాను.

రాత్రి బాగా నిద్రలో ఎవరో దబదబ తలుపు కొడుతున్నట్టయి ఉలిక్కిపడి లేచి

